క్లుప్తంగా

జేపీఎస్‌లకు మద్దతు



మద్దతు తెలుపుతున్న ఉప సర్పంచులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆమ్‌ఆద్మీ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ కో ఆర్డినేటర్ నయీం పాషా మద్దతు తెలిపారు. సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి జేపీఎస్‌లను శాశ్వత కార్యదర్శికి ఉన్న అధికారాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొంటు రాజేందర్, విజయ్‌కాంత్, శ్రీనివాస్, శ్రీకాంత్, పవన్, సంతోష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు ఉప సర్పంచుల మద్దతు
జన్నారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మెలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచులు శ్రీనివాసగౌడ్, సీపతి ఆనందం, మాణిక్యం, నర్సగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ ప్రమాదకరం

శ్రీరాంపూర్: వడదెబ్బ ప్రమాదకరమని తగు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాపాయం వరకు వెళ్తుందని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ సమయంలో బయటికి వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా రుమాలు ధరించాలన్నారు. కాటన్ లేత రంగు దుస్తులు ధరించాలన్నారు. ఎండకు వెళ్లి వచ్చిన తరువాత నీరసంగా ఉన్నా, వాంతులు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే అది వడదెబ్బగా భావించి వెంటనే వైద్యున్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ డీజీఎం వెంకటేశ్వర్‌రావు, ఇంజనీర్ బానోత్‌మోహన్ పాల్గొన్నారు.

గాయపడ్డ కార్మికుడికి పరామర్శ

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఎల్కపల్లి మల్లేశ్ అనే కాంట్రాక్టు కార్మికుడు ఆదివారం రెండో షిఫ్టులో గాయపడగా సోమవారం హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ అనుబంధ కార్మిక సంఘం నాయకులు ఆస్పత్రిలో పరామర్శించారు. మల్లేశ్ రెండో షిఫ్టులో యూనిట్-1 బాయిలర్‌లో మిల్లర్ మోటర్ వద్ద రిజెక్ట్ కోల్ ఫ్రైజర్‌తో రావడం, విషయవాయివు విడుదలై కార్మికుడు అస్వస్థతకు గురికాగా, సిబ్బంది మంచిర్యాలలో ఓ ప్రైయివేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషవాయువుతో శ్వాస రాక అస్వస్థతకు గురయ్యాడని కార్మికుడికి మెరుగైన వైద్యం అందించడానికి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ నాయకులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణ, నవీన్ డిమాండ్ చేశారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డులు అందుకున్న టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం కమిటీ సభ్యుడు పెట్టం లక్ష్మణ్‌ను సోమవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ డిపార్టుమెంట్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. వారి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డీజీఎం శివరావు, ఫిట్ సెక్రెటరీ పేగ మలయ్య వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తొంగల రమేశ్, ఉద్యోగులు సంతోశ్, సదానందం, మల్లేశ్, శ్రీనివాస్, సతీశ్, అనంతరెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛ అవార్డుకు ఇంటింటా సర్వే

జన్నారం: స్వేచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు ప్రతిపాదిత గ్రామం దేవునిగూడలో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. సర్పంచ్ గుర్రం శిరీషరెడ్డి, ఎంపీవో రమేశ్, జిల్లా సమన్వయకర్తలు రాజేందర్, మల్లేశ్, ఏపీఎం బుచ్చన్న, ఉప సర్పంచ్ బుచ్చన్న, గ్రామైక్య సిబ్బంది టీంగా వెళ్లి గ్రామంలో పర్యటించారు. అభివృద్ధి పనులతో పాటు, గ్రామ స్వచ్ఛతపై పరిశీలన చేశారు. పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

22వ రోజుకు వీవోఏల సమ్మె

దండేపల్లి: వీవోఏలు చేస్తున్న సమ్మెకు దండేపల్లిలో బీజేపీ నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. న్యాయపరమైన డిమాండ్లు తీర్చాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య తదితరులు ఉన్నారు.
చెన్నూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం నాటికి 22వ రోజుకు చేరింది. కార్యక్రమంలో వీవోఏలు సడవలి, సతీశ్, రాపెల్లి సత్యనారాయణ, భైరి రాజ్యలక్ష్మి, నరిగే రజిత, పంచ గౌరి, అయిత హేమలత, బొందయ్య, శంకర్, స్వప్న, శేఖర్‌లు పాల్గొన్నారు.



సీసీసీలో నిర్మాణ దశలో ఉన్న వైకుంఠధామం

నిండా నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం!

- నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో నత్తనడకన అభివృద్ధి పనులు
- వసతుల లేమితో ప్రజలకు తప్పని ఇక్కట్లు

నస్పూర్: పట్టణ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతుండగా, మరికొన్ని పనులు ప్రారంభానికే నోచుకోలేదు. అభివృద్ధి పనులు మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం పొందడం వరకు ప్రక్రియ వేగంగా సాగుతుండగా, తదనంతర ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పట్టణ పరిధిలో 25వార్డులు ఉండగా, సుమారు 90లక్షల జనాభా ఉంటుంది. ప్రజల అవసరాల కోసం పట్టణ పరిధిలో సమీకృత మార్కెట్, రెండు వైకుంఠ దామాలు, మూడు చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు.

చివరిమజిలికి ఇబ్బందులు..
పట్టణ పరిధిలో సీసీసీ తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో, తాళ్లపల్లి విలేజ్ గోదావరి నది ఒడ్డున ఒక్కొక్కటి సుమారు రూ.1కోటితో రెండు వైకుంఠదామాలు ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ దామాలు ఏర్పాటులో జాప్యం వల్ల చివరిమజిలీకి ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. వైకుంఠధామాలు వెంటనే పూర్తి చేసి ప్రజల కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఊసే లేని చిల్డ్రన్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు..
పట్టణ పరిధిలో 13, 3వ వార్డుల్లో సుమారు రూ.50లక్షల నిధులతో రెండు చిల్డ్రన్ పార్కులు, 6వార్డుల్లో ఒక్కో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.20 లక్షల చొప్పున నిధులతో అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. ఎక్కడా కూడా నేటివరకు పనులు ప్రారంభం కాలేదు. చిల్డ్రన్ పార్కులు ఇప్పటికే ఏర్పాటు చేసి ఉంటే వేసవి కాలంలో పిల్లలు ఆట పాటలతో సేదతీరేవారు. అధికారుల అలసత్వం వల్ల, నిధుల విడుదలలో జాప్యం వల్ల పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం

పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేయిస్తాం. వైకుంఠ దామాలు సైతం త్వరలో పూర్తి చేస్తాం. చిల్డ్రన్ పార్కులు, ఓపెన్ జిమ్‌లకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. స్థల సేకరణలో జాప్యం జరుగుతుంది. సింగరేణి అధికారులతో చర్చించి స్థల సేకరణలో ఇబ్బందులు తొలగించి వాటికి సైతం త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- టి.రమేశ్, మున్సిపల్ కమిషనర్

కొనసాగు..తున్న సమీకృత మార్కెట్ పనులు

పట్టణ పరిధిలోని నస్పూర్ రాయల్ థియేటర్ సుందరయ్య కాలనీ సమీపంలో ప్రతీ మంగళ, శనివారాలు కొత్త రోడ్డులో శుక్రవారం, సోమవారం శ్రీరాంపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు ఆవరణలో వారసంతలు నిర్వహిస్తారు. వీటికి మున్సిపల్ ఆధ్వర్యంలో సిబ్బంది వారసంతలలోని చిరువ్యాపారుల వద్ద కొంత రుసుం వసూలు చేస్తారు. దీని ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుంది. ఆదాయం వస్తున్నా, వారసంతల వద్ద చిరు వ్యాపారులకు కనీస మౌళిక వసతులు కూడా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయలేదు. మహిళా వ్యాపారస్తులకు కనీసం టాయిలెట్స్ ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయల్ గార్డెన్ సమీపంలో సుమారు రూ.7కోట్లతో చేపట్టిన సమీకృత భవన నిర్మాణం పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో వ్యాపారస్తులు వారసంతను రాయల్‌గార్డెన్ వద్ద రోడ్డుపై నిర్వహిస్తుండగా, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత మార్కెట్ అందుబాటులోకి వస్తే కూరగాయలు, పూలు, పండ్లు, చికెన్, మటన్, చేపలు వంటివి అన్నీ ఒకే చోటే లభ్యం అవుతాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ప్రజావాణికి స్పందన కరువు



చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి



ప్రజావాణిలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మయ్య



భీమారంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించగా, ఎలాంటి దరఖాస్తులు రాలేదు. ఎంపీఓ బాపురావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఈసీ మధుకర్, అధికారులు పాల్గొన్నారు.
భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు, ప్రజలు లేక వెలవెలబోయింది. అధికారులు డుమ్మా కొట్టడంతో ప్రజలు కూడా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ప్రత్యేకాధికారితో పాటు ఇతర శాఖల అధికారులు ఎవరూ రాకపోవడంతో ఎంపీడీవోతో పాటు ఈజీఎస్ అధికారులు సమయం అయ్యేంత వరకు ఉండి వెళ్లిపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజావాణి సక్రమంగా కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.
చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఇందులో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఏవోకు ఫిర్యాదులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యల పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్‌లో అర్జీదారులు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా ప్రజలు జిల్లా కలెక్టరేట్ ఏవో సురేష్‌కు ఫిర్యాదులు అందించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, ఇతర అధికారులు జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఉండగా ఏవో ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, భూ పరిహారం, తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. మందమర్రి, రామకృష్ణపూర్‌కు చెందిన కే. సూర్యమ్మ 2020వరకు వితంతు పింఛన్ వచ్చిందని, ఇప్పుడు రావడం లేదని, భీమారం మండలం దాంపూర్ గ్రామ పెద్ద చెరువు ప్రాంత మత్స్యకారులు ఫిషరీష్ సొసైటీ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఫిర్యాదు చేశారు.

కొడుకు వెల్లగొట్టాడు..



నా భర్త మరణాంతరం కొడుకు ఉప్పనూతల సురేష్‌కుమార్‌కు సింగరేణి ఉద్యోగం వచ్చింది. నా పేరుమీద ఉన్న భూమిని నాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు. కొడుకు, కోడలు చివాట్లు పెడుతూ, తిడుతూ వేధిస్తున్నారు. నేను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. పలుమార్లు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన, పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా పెట్టాను. అయినా నన్ను వేధిస్తున్నాడు. బీపీ, షుగర్ తో బాధపడుతున్నా. కొడుకుపై చర్యలు తీసుకొని నన్ను ఆదుకోవాలని ఫిర్యాదు చేశాను.

- ఉప్పలనూతల లక్ష్మి, క్యాతనపల్లి

కేటీఆర్ సభలో యువకుడి హంగామా



యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బెల్లంపల్లి: స్థానిక ఏఎంసీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రుల సభలో ఓ యువకుడు హంగామా చేశాడు. రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావుకు వినతిపత్రం ఇవ్వడానికి సభా వేదిక వద్దకు వెళ్లడానికి యత్నించడం కలకలం సృష్టించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామం నుంచి పైకాజీ గూడ గ్రామానికి ఐదు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, బీఆర్ఎస్ పార్టీ గులాబీ కండువాను కప్పుకుని చేతిలో వినతిపత్రంతో ఓ యువకుడు బారికేడ్‌ను దాటుకుని వెళ్లడానికి యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సదరు యువకుడు బిగ్గరగా అరవడంతో సభలో ఒక్కసారిగా అలజడి రేగింది. వెంటనే తేరుకున్న పోలీసులు వేదిక వద్దకు వెళ్లకుండా మధ్యలోనే యువకుడిని నివారించారు. అక్కడి నుంచి ఆ యువకుడిని పక్కకు తీసుకువెళ్లారు.

అరెస్టులు అక్రమం

శ్రీరాంపూర్: బీఆర్ఎస్ నేతలు ఈ ప్రాంత పర్యటనకు వస్తే కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టడమేనా బంగారు తెలంగాణా అని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి, రామగుండంకు మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా అక్రమంగా తమ యూనియన్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	60
బీరకాయ	80
వంకాయ	40
కాకరకాయ	70
బెండకాయ	50
అలసంద	50
దొండకాయ	70
సొరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	60
క్యారెట్	60
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40

- మంచిర్యాలఅగ్రికల్చర్

ఘనంగా తలసేమియా దినోత్సవం



మందులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో సోమవారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ దినోత్సవం సైతం ఒకేరోజు కావడంతో ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హేనరీ డునేటో చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, తలసేమియా పిల్లలు, వారి తల్లిదండ్రులకు మిఠాయిలు పంపిణీ చేసి, స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు సత్తిరెడ్డి జన్మదినం పురస్కరించుకుని తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం మందులకు అవసరమైన ఆర్థిక సాయం అందజేశారు. శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, జిల్లా కోశాధికారి పడాల రవీందర్, మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్ కాసర్ల శ్రీనివాస్, వి.రాధాకృష్ణ, మధుసూదన్ రెడ్డి, నాగేందర్, కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఈరోజు

నేడు నస్పూర్ కాలనీలో హనుమత్ మహాయజ్ఞం

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామ సహిత హనుమత్ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు ఎం.ఫణికుమార్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ దీక్షలు తీసుకున్న స్వాముల ఆధ్వర్యంలో ఈ యజ్ఞం జరుగుతుందన్నారు. 23ఏళ్లుగా హనుమన్ జయంతికి ముందు యజ్ఞం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఉదయం 10గంటలకు యజ్ఞం ప్రారంభం అవుతుందని, దీక్షలు తీసుకున్న హనుమాన్ స్వాములతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. స్వాములకు భిక్ష, భక్తులకు సామూహిక అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

రైతులకు న్యాయ సలహా సదస్సు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో రైతులకు న్యాయ సలహా సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి డీ.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి హాజరు అవుతారని ఆయన తెలిపారు. సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మందమర్రిలో హనుమాన్ చాలిసా పారాయణం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో గల శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7:30నివిషాలకు హనుమాన్ చాలిసా పారాయణం ఉంటుందని ఆలయ అర్చకులు కృష్ణకాంతచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరా రు. 14న ఉదయం 10గంటలకు హోమం, అనంతరం అన్నప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు

చెన్నూర్: పట్టణంలోని కేసీఆర్ పార్క్ ఎదుట గల షాదీఖానాలో మంగళవారం సాయంత్రం 3గంటలకు చెన్నూర్ నియోజకవర్గ స్థాయి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, బీఎల్‌వోలు, తహసీల్దార్లు, సూపర్‌వైజర్లకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే తెలిపారు. అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి రాములు హాజరవుతారని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, అన్ని పార్టీల ప్రతినిధులు, ఓటర్లు హాజరుకావాలని కోరారు.

బియ్యం అందజేత
రామకృష్ణాపూర్: పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన కుచన వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడికి జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజరమేష్ సోమవారం 25కేజీల బియ్యం అందజేశారు. స్థానిక హనుమాన్ భక్తులకు అన్నదానం నిమిత్తం 100కేజీల బియ్యం అందించారు.

యువసంఘర్షణ సభకు తరలిన నాయకులు
మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో సోమవారం జరిగిన యువ సంఘర్షణ సభకు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.
దండేపల్లి: హైదరాబాద్‌లో సోమవారం జరిగిన యువసంఘర్షణ సభకు దండేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో సభకు వెళ్లారు. వెళ్లిన వారిలో త్రిమూర్తి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం
దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నాగరాణి, సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకుడు రాంచెందర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత
మందమర్రిరూరల్: భారత రాజ్యాంగాన్ని దేశంలో ప్రతి పౌరుడికి ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సంపతి శ్రీనివాస్‌కు సోమవారం ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నందిపాటి రాజు, సురేందర్, మేడి రాజు, గడ్డం రమేష్, స్వామి, మురళి, హిమచంద్ ఉన్నారు.


కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు
భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి బెల్లంపల్లిలో జరిగే మంత్రి కేటీఆర్ సభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బెల్లంపల్లి వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ నిరంజన్‌గుప్తా, కన్నెపల్లి జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో బస్సులు, బైక్, ఆటోల ర్యాలీలో తరలివెళ్లారు.

సంక్షిప్త వార్తలు

క్రీడా టీంలు ఏర్పాటు చేయాలి
లక్సెట్టిపేట: గ్రామ స్థాయిలో సర్పంచులు క్రీడలు నిర్వహించి టీంలు సెలక్ట్ చేసి ఈ నెల 11వ తేదీలోపు ఎంపీడీవో కార్యాలయంలో అప్పజెప్పాలని ఎంపీపీ అన్నం మంగ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కప్ క్రీడల నిర్వహణకు గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడలు నిర్వహించి, మండల స్థాయిలో పాల్గొనేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 16, 17వ తేదీల్లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముందస్తు అరెస్టులు
వేమనపల్లి/నెన్నెల/భీమిని/దండేపల్లి/చెన్నూర్/కాసిపేట/జైపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/శ్రీరాంపూర్/లక్సెట్టిపేట: బెల్లంపల్లిలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పలు మండలాల్లో బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, వైఎస్సార్‌టీపీ నాయకులను కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేయడాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు ఖండించారు. అరెస్ట్‌లు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ప్లాంట్‌లు పెరిగినా కొద్ది ఉద్యోగాలు తగ్గుతున్నాయి తప్పితే, పెరగడం లేదని ఈ విషయం పాలకులకు తెలియదా అని కాసిపేటలో పలువురు నాయకులు ప్రశ్నించారు. స్థానికులకు, ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆటలు ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: పిల్లలు వేసవి సెలవులను వృథా చేయకుండా కంపెనీ ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ప్రగతి మైదానంలో పిల్లల కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు సెల్‌ఫోన్‌లో ఆటలు కాకుండా, మైదానంలో ఆడే ఆటలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. 25రోజుల పాటు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సీనియర్ పీఈటీ కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ సురేశ్, కేప్టెన్ గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మారుతినగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మంత్రి గంగుల కమలాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో పండ్లను పంపిణీ చేశారు.